# సాంబయ్య కథ

రాకరాక మావూరు రావాలనుకున్న ప్రతివాడూ మీఊరొస్తే ఏం చూపిస్తావని అడగటం పరిపాటి. నాబొంద మావూరిలో ఏముంది ప్రత్యేకంగా చూపించటానికి. ఇకపోతే అనుభవించగల్గితే పగలు రాత్రనకుండా కుంపటిముందు కూర్చున్నంత వేడిగా మాత్రం వుంటుంది మావూరిలో. అసలు పసుపు పచ్చగా కాచి, అందులో తిరిగేవాడిని కారునలుపుగా చెయ్యగల ఎండలకు మాత్రమే మాఊరుప్రసిద్ధి. కాని ఎండలు రుచిచూపిస్తా నాతో వస్తావాఅంటే నన్నో మృగంలా చూడకుండా వుంటారా? ఇంకాపైగా చెప్పదలచుకుంటే ఏనుగులంత దోమలు, వాటిఫలితమా అంటూ వచ్చే ఏనుగుకాళ్ళు, ఇరుకుసందులు మురికి వాసనలు మాఊరికో ప్రత్యేకత సంపాదించి పెట్టకపోయినా వాటికి మాత్రం ఓ ప్రత్యేకతవుంది మావూరిలో. మురికి కాలువ ప్రక్కనే కుర్చీ వేసుకుని సింహాసనంలో రాజుగారిలా ఠీవిగా కూర్చుని వుంటే ఎవడిని చూసినా వీడికావాసన రావడంలేదా అనే అనుమానం మీకయితే కల్గుతుందేమోగాని వాడికి మాత్రం ఏదో అత్తరు ఫ్యాక్టరీ దగ్గర కూర్చుని సుగంధం పీల్చుతున్నట్లే వుంటుంది మరి. ఎవరికైనా అటువంటి వాళ్ళ ముక్కులు చూసి ఆశ్చర్యం కల్గుతుందేమోనని మాత్రం మాఊరు రమ్మనవచ్చు.

ఇదంతా అయితే ఇంతక్రితం వరకుమాత్రమే. కాని ఈమధ్యన మావూరెవరయినా వస్తానని అంటే వెంటనే తప్ప

కుండా రమ్మని బ్రతిమిలాడటం అలవాటు చేసుకున్నా. ఎందు కనంటారేమో. అందరిలా మీకూడా సందేహం రావచ్చు. అలాంటి సందేహాలకు నేనేమి అనుకోనుకూడా. ఉన్నట్లుండి మావూరిలో తాజమహలేమీ కట్టలేదు. కనీసం అలాంటి పేరుతో ఈమధ్య ఓ పాకా కాఫీ హోటలయినా లేచిందో లేదోకూడ తెలియదు.అలానే ఏసినిమాస్టారయినా క్రొత్తగా నివాసమూ ఏర్పరచుకోలేదు. ఇంకా చెప్పాలంటే ఇందిరా గాంధీకి 'వేసవి విడిది' లాంటి ఏర్పాట్లుకూడా ఏమీ జరగ లేదు.

మరి నేను ఇతర్లను రమ్మనమని మరీమరీ బ్రతిమిలాడ టంలో మాఇంట్లో వసతి సౌకర్యాలు పక్కాగా వుంటాయని కూడా కాదు.

మావూరెవరిని రమ్మన్నా, ఎప్పుడురమ్మన్నా, ఎం దుకురమ్మన్నా సాధారణంగా దానికంతా ఒక్కటే కారణం వుంది. అసలెవరైనా వస్తే మావూరిలో వుండే ఒకవింత.... కాదుకాదు ఒకవింత మనిషినిచూపించాలని ప్రయత్నించటం నాకో అలవాటయిపోయింది. ఆవింతే .... అదే ఆవింత మనిషికథే నేను చెప్పబోయే సాంబయ్యకథ.

అన్నట్లు ఒక విషయం. నేను ఇప్పుడే మీతో చెప్పి నట్లు సాంబయ్య కథ మాత్రమే వింతకాదు...అసలు సాం బయ్యే ఒక వింతమనిషి. ఎవరా సాంబయ్య మేమెప్పుడూ

అతని గురించి వినలేదే అని మాత్రం నన్నడగకండి. సాంబయ్య పేరెప్పుడయినా పేపరులో వస్తూవుంటుందా, కనీసం అతని ఫొటోలయినా ఒక్కసారేనా ప్రచురించబడిందా? అతను తెల్లగా వుంటాడా నల్లగా వుంటాడా? పొట్టా పొడుగా సన్నమా లావా, మూతి వంకరగా వుంటుందా తిన్నగా వుంటుందా, ముక్కులావా సన్నమా లేకపోతే గద్దముక్కులా వుంటుందా ఇవన్నీ అడగటంతో పాటు మీకేది తోచి ఇంకా అడిగినా నేనేదో సమాధానం ఇచ్చికూడా ప్రయోజనం వుండదు. ఎందుకంటే సాంబయ్యలోనిగొప్పతనం, సాంబయ్య వల్ల ఇతరులకుండే అవసరం, అతనెంతేసి పనులు చెయ్యగలుగుతాడో పేపరు వాళ్ళకేం తెలుసు, మీకుమాత్రవేం తెలుసు. అసలు పేపరు వాళ్ళేగనక గుర్తించివుంటే, ఆసంగతి మీచెవుల దాకా వచ్చివుంటే నేనెందుకు పిలవాలి ఎవర్న. యినా రమ్మనమని, వాళ్ళేపరుగెత్తికొనిరాకుండా వుంటారా?

అసలుసాంబయ్యంటే ఎవరో, అతని గొప్పతనమేంటో నాక్కూడ ఈమధ్యనే తెలిసింది. తెలియగానే సాంబయ్యను చూడాలనిపించింది. చూసేంతవరకు నిద్రపట్టేట్లు కన్పించలేదు. సాంబయ్య ఎక్కడుంటాడో, ఎప్పుడుంటాడో వివరాలన్నీ తెలుసుకునే బయలుదేరాను చూద్దామని. మా ఇంటికి కనీసం ఆరుమైళ్ళయినా వుంటుంది. సాంబయ్యవుండేప్రదేశం. తీరా అంతదూరం రొప్పుకుంటూ వెళ్ళేటప్పటికి నిరాశే ఎదురయింది. ఆరోజే సాంబయ్య అత్తారింటికెళ్ళాడట. ఒక

వేళ సాంబయ్య గనక కన్పిస్తే ఓసహాయం చేసిపెట్టమని విమల అడిగింది. అసలు సాంబయ్యనేబడే ఓ శరీరమే కన్పించకపోతే విమలకుమాత్రం ఏ సహాయం చెయ్యగలను? ఇంతవరకు సాంబయ్య అన్నావు అతనెవరో చెప్పకనే పోతివి. ఇప్పుడేదో విమల అంటున్నావు. పైగా సహాయం అంటావు అవన్నీ ఏమిటో సరిగ్గా చెప్పవయ్యాస్వామీ అని మీరు నన్నడగ వచ్చు. అందుకనే అసలు జరిగినదంతా సవిస్తరంగా చెప్తాను.

నేను చదువుకునేది మావూరికి రెండువందల మైళ్ళ దూరంలో. చిన్నప్పటినుంచి మాత్రం అంత దూరంలో చదవలేదు సుమండీ. అయినా లక్షణంగా అన్ని కాలేజిలూ మావూరిలోవుండగా పరాయివూరు పోవల్సినంత ఖర్మ ఈ మధ్యనే దాపురించింది. ఎటొచ్చీ పై చదువులు చదవాలంటే మావూరిలో సాధ్యపడదు. కాబట్టి అంతదూరం వెళ్ళవలసి వచ్చింది ఈ సంవత్సరమే. సెలవలిస్తారని తెలియగానే రెండు రోజులు ముందుగానే మావూరు వచ్చేయటం, రాంగానే వెంటనే విమలను వెళ్ళి చూసేయటం కూడా అలవాటయింది. విమల మా మేనత్త కూతురేం కాదు; ఎటువైపు తిరగవేసినా దగ్గర బంధుత్వంకాదుగదా కనీసం దూరంగాకూడా అలాంటి సంబంధాలేమీ లేవు. అయితేనేం విమలంటే నాకెంతో ఇష్టం. ఇద్దరి సంబంధం మీకెవ్వరికీ తెలియరాని అనుబంధం; విమలతో నా పరిచయం, ఆ అనుబంధం మాత్రం ఈనాటివి కావు.

మా తొలిపరిచయం పదేండ్ల క్రితమే జరిగినా, ఈ అనుబంధం చెక్కు చెదరకుండా వుండటానికి కారణం విమలే. నేనుండేది పరాయి వూరయినా, గడిపేది క్రొత్తమనుషులతో నయినా ఏదిగులూ లేకుండా కాలం నెట్టివేస్తున్నానంటే కేవలంక్రమం తప్పకుండా విమల వుత్తరాలు రాయటంవల్లనే. నేను మా ఊరు వచ్చినట్లు తెలియగానే నన్నుచూడటానికి నేనామెను చూడటానికి వెళ్ళకముందే వస్తుంది. సాధ్యమైనంత వరకు మా ఇంట్లోనే గడిపివేస్తుంది. నేనున్న నాళ్ళు విమలది మా ఊరుమాత్రం కాదు. ఎప్పుడో వాళ్ళ నాన్నగారు మాత్రం ఇక్కడ వుద్యోగం చేసారు. ఆయన ఉద్యోగరీత్యా అనేక ఊర్లు తిరుగుతున్నా విమలమాత్రం మాఊరిలోనే వుండి పోయింది. విమల వాళ్ళనాన్నగారితో వుండేరోజుల్లో వాళ్ళ ఇల్లు మాఇంటికి రెండిళ్ళ దూరంలోనే వుండేది. కాని ప్రస్థుతం విమల కాలేజి హాస్టల్లో వుంటోంది.

ఒకసారి సెలవలకు మాఊరొచ్చి ఆరురోజులయినా కాలేదు. ఎందుకనో విమల ఓ స్నేహితురాలిని చూడాలని, అక్కడే ఒకవారం రోజులు గడుపుతుందని అన్నీ సర్దుకుని సిద్ధమవ దలచుకుంది విమల. ఆరోజు సాయింత్రం నాకూడా ఏదోపనివుండి వాళ్ళ హాస్టలుకు వెళ్ళలేకపోయాను. కాని తప్పకుండా ఆరోజురాత్రి సర్కార్ ఎక్స్‌ప్రెస్ దగ్గరకొచ్చి విమలను కలుసుకుంటానని మాటిచ్చాను. కాని అనుకోకుండా

కలిసిన ఓస్నేహితునితో వళ్లు తెలియకుండా అదేపనిగా మాట్లాడుతూ ఓకప్పు కాఫీ చప్పరిస్తూవుంటే, హోటల్ గోడకుండే గడియారం అలవాటుచొప్పున వుసూరుమంటూ తొమ్మిది ఠంగు ఠంగుమని కొట్టేటప్పటికిగాని నాకు తెలియలేదు సర్కారుకు టైమయిందని.

అప్పటికిగాని స్టేషను కెళ్లాలని గుర్తు రాలేదు. వెంటనే రిక్షా వేసుకుని స్టేషనుకి ఆదరా బాదరాగ వెళ్లాను. ప్లాట్ ఫారంమీద రైలు బయలు దేరటానికి సిద్ధంగానేవుంది. విమల ఏ కంపార్టుమెంటులో ఎక్కిందో తెలియదు. ఒకవేళ స్లీపరులో కాళీ దొరికితే అందులోనే ఎక్కివుంటుందనుకున్నాను. సరాసరి స్లీపరు దగ్గరకే వెళ్ళి పెట్టెలోకి తొంగిచూసాను. తొమ్మిదిన్నరయినా కాకముందే చాలామంది గురకలు పెడ్తున్నారు. అదే మన ప్రజలతో వచ్చినతంటా. కాళీదొరకకపోతే తలుపు దగ్గరున్న ఊసనయినా పట్టుకుని వ్రేలాడుకుంటూ శివరాత్రి జాగారమయినా చేస్తారు. కాని కాస్త సుఖం దొరికిందో మొదటినుండి చివరవరకు తప్పకుండా అనుభవిస్తారు. కాళీ దొరకాలేగాని, ఎక్కడలేని నిద్రవచ్చి అమాంతంగా చుట్టుకుంటుంది.

కిటికీనుంచి పెట్టెలో ఎవరున్నది తెలియకపోతూవుంటే పెట్టెలోఎక్కి ఎవరున్నదీ చూద్దాంగదా అని ఎక్కబోతూ వుంటే "ఏయ్ మిస్టర్, రిజర్వేషనులేకపోతే ఈపెట్టె ఎక్క-

కూడదు'' అన్నాడు కండక్టర్. నాకెక్కడా లేనికోపంవచ్చింది ఆమాత్రం తెలియకుండా పోదులేస్తామా. ఛాన్సుదొరికింది గదా డబాయించటానికన్నట్లు ఎక్కకముందే నీ సొదేమిటి. వెధవ గారపళ్ళమొఖమూ నువ్వూ' మనసులోనే తిట్టు కున్నాను. పైకిమాత్రం నవ్వుతూ రిక్వెస్ట్ చేస్తున్నట్లు,‘ తెలిసిన వాళ్ళు మద్రాసు పోతున్నారు. వాళ్ళనుచూసి పోదామని వచ్చాను. ఈ కంపార్టుమెంటులో వున్నారేమోనని ఎక్కబోతున్నాను. అంతేగాని నేను ట్రావెల్ చెయ్యటం లేదులెండి'' కాని పెట్టెంతా వెతికినా విమల కన్పించలేదు. రిజర్వేషను చేసుకోలేదుగా, ఇంకేదయినా పెట్టె ఎక్కివుంటుంది; ఒకసారి అన్ని కంపార్టుమెంటులు వెతికేస్తే సరిపోతుందిగా. ఓ మూడో క్లాసు పెట్టెలో కార్నర్ సీటులో కూర్చుని ఎవరివైపో అదేపనిగా కన్నార్పకుండా చూసే ఓ గళ్ళ బుష్ షర్టు యువకుడు కన్పించాడు. తప్పకుండా అతను చూసేది ఏ ఆడవాళ్ళవైపో అయుండాలి. దగ్గరకెళ్ళి గమనించాను. ఓ ముసలి చూపుల పడుచమ్మాయి పేపరు చూడటంలో నిమగ్నమైవుంది. తదేకధ్యానంతో ఆవైపే చూసి లొట్టలేసే ఆగళ్ళ బుష్షర్టుని చూసి మనసులోనే అనుకున్నాను. “వెధవ టేస్టూ నువ్వూ ......జాగ్రత్త ఆ అమ్మాయికి దృష్టితగిలేను!''

నా ఎదురుగుండా, వెనక కూలీవస్తుంటే త్వరత్వరగా నడుస్తూ రైలుపెట్టెల్ని వెతుక్కుంటూ వెళ్ళే ఒకామె కన్పించింది. అదే పొడుగు .... అంతేలావు విమలకదూ? అవును తప్పకుండా విమలే. ఎలా విమలను అందుకోవటం. పెద్దగా అరిస్తే బాగుండదనికూడా అనుకుంటూనే విమలా. అంటూ గట్టిగా అరిచాను.

వెళ్ళేఆవిడ వెనక్కు తిరిగి చూసింది. కాని ఆవిడ విమల మాత్రంకాదు. ఇంకెవరో. ఎవరయితేనేం మొత్తం మీద సాధనాలావుంది. నావైపు మింగుతానన్నట్లు కొర కొరా చూసింది. నాకేంచెయ్యాలో తోచలేదు. తలలో వేళ్ళనుపోనిచ్చి గోక్కోవటం ప్రారంభించాను.

'ఓ కమలా! ఇంతలేటా .... చూచిచూచి విసుగెత్తి పోయిందనుకో. అసలు ఈరోజున ప్రయాణం మానుకున్నా వేమోననుకున్నాం. ఇంకానయం తీరా రైలుపోయినతర్వాత రాలేదు! నువ్వెప్పుడూఇంతే. ఇవ్వాళెందుకనో రైలు బయ ల్దేరవలసిన సమయమయినా రిజర్వుకంపార్టుమెంటు రైలు కింకా తగిలించలేదు. ఇక్కడకే వస్తుందట, అంతవరకు ఇక్కడే వేచివుందాం" ఓహైహీల్సు అమ్మాయి, నావైపే చూసే అమ్మాయిని పలకరించేటప్పటికి నాకర్థమయింది. నేను విమలా అని పిలవగానే, ఏ ఫ్రెండుకోసమో ఎదురు చూస్తుండే ఈమెకు 'కమలా' అని విన్పించివుంటుంది. ఖర్మ కాకపోతే మరేమిటి.

ఇంతకీ విమల ఎంత వెతికినా కన్పించనేలేదు. తప్పకుండా సర్కారుకు బయలుదేరుతున్నానని అంతగా చెప్పిన విమల చెప్పాపెట్టకుండా ఇంతలోనే ప్రయాణాన్ని ఎందుకు విరమించుకున్నట్లు? ఇంటికి వెళ్ళగానే విమలకు ఫోనుచేసి కనుక్కోవాలనుకున్నాను. నేను ఇంటికి వెళ్ళేటప్పటికి చెల్లి నాకోసమే ఎదురుచూస్తూవుంది. "ఎక్కడ నుంచన్నయ్యా రావటం స్టేషనునుంచి కాదుగదా?" అవునని సమాధాన మిచ్చాను. "ఇంటికి వచ్చి భోంచేసి వెళ్తావని అనుకున్నాం. కాని సాయంత్రం బజారుకని వెళ్ళిన వాడివటునుంచి అటే వెళ్తావని అనుకోలేదు. విమల ఫోనుచేసి చెప్పింది. తను ప్రయాణం మానుకున్నట్లు. అయ్యో పిచ్చిఅన్నయ్యా, పాపం బండి కదిలినంతవరకు స్టేషనులోనే వున్నావుకదూ?" అసలె విసుగ్గావుంది. అయినా నారూంకు వెళ్ళబోతూ అడిగేను. "కారణమేమిటట?"

"సాంబయ్య రాలేదుట!" చెల్లి ఎవర్నిగురించి చెప్తూ వుందో నాకర్థంకాలేదు. కనీసం ఆపేరు విన్నట్లుకూడా నాకు జ్ఞాపకంలేదు. అయినా విమలకు పరిచయమున్న వాళ్ళంతా దాదాపు నాకందరూ తెలుసు. కానిఆజాబితాలో నేనెప్పుడూ ఈ సాంబయ్యనే వాడిగురించి వినివుండలేదు. ఎన్నోరోజుల నుంచి వెళ్ళాలని అనుకుని, ఆస్నేహితురాలికి తను వస్తున్నట్లు కూడా టెలిగ్రాం ఇచ్చితీరా ఒకరిగురించి ప్రయాణం మాను

కోవాల్సిన ఆగత్యం ఏర్పడినదంటే ఈ సాంబయ్యెవరో ముఖ్యుడే అయివుంటాడనుకున్నాను.

"సాంబయ్యెవరు సుధా" చెల్లినడగగానే బదులు చెప్పింది. "సాంబయ్యంటే వాళ్ళచాకలి." .... ఎంత ఆపుకుందామన్నా నవ్వు లోపల అణచుకోలేక పోయాను. బైటికి ఇల్లు దద్దరిల్లేలా నవ్వేశాను. రైలు కేన్సిలయిందని ప్రయాణం ఆపుకున్న వాళ్ళను చూసా, తీరా ప్రయాణమయే సమయానికి ఒంట్లో బాగుండక మానివేసిన వాళ్ళనూ చూసా. రిజర్వేషను దొరకలేదని మరో రోజుకి ప్రయాణం వాయిదా వేసుకోవటం విన్నాను. కాని చాకలి రాకపోవటంవల్ల ప్రయాణాన్ని మానుకోవటం నేనెప్పుడూ వినలేదు, చూడలేదు. అసలలా జరుగుతుందని నేను నమ్మటానికికూడ కష్టమే. అయినా ప్రయాణం గురించి అన్ని రోజులలా అనుకుంటున్నప్పుడు చాకలి దగ్గరనుంచి బట్టలు వచ్చేలా ఎవడైనా చూసుకుంటాడు .... ముందుగానే జాగ్రత్త పడతాడు. అలాంటప్పుడు మరి విమలెందుకు అశ్రద్ధచేసింది? విమలా అలా వూరుకునే మనిషి కాదే. ఎంత ఆలోచించినా ఏమీ అర్థం కాలేదు. అయినా దీనికి బుర్రబద్దలుచేసుకునే బదులు రేపు హాస్టల్‌కి వెళ్ళినప్పుడు తెలుసుకుంటే సరిపోతుందిగా అనుకున్నాను.

మరుసటిరోజు సాయంత్రం నేను హాస్టల్‌కి వెళ్ళేటప్పటికి విమల నాకోసమే ఎదురు చూస్తూవుంది. విమల ప్రక్కనే

ఇందిరకూడావుంది. ఇందిర విమలకు చాలా సన్నిహితంగా వుంటుంది ఒకర్ని విడిచి మరొకరు వుండలేనంత గట్టిది వారి మధ్యస్నేహం. "అయితే నిన్న స్టేషనుకే వెళ్లావా ఏమిటి? సుధకు ఫోనుచేసేటప్పటికి నువ్వు ఇంట్లోనే వుంటావని అనుకున్నాం. ఏది ఎలాగయినా 'సారీ ఫర్ ది డిసపాయింట్ మెంట్' అంది విమల.

"అది సరేగాని, ఇంతకీ హఠాత్తుగా నువ్వు ప్రయాణ మెందుకు మానుకోవల్సివచ్చిందో తెలుసుకోవచ్చునా ... ఆ! అదేలే అడగవచ్చునాఅని ...." విమలేం చెప్తుందోనని ఎదురు చూస్తున్నాను.

"ఆ! చెప్పుకోదగ్గ కారణమేమీ లేదనుకో. చాకలివాడు రాలేదు. చివరి క్షణంవరకు వస్తాడేమోనని ఎదురు చూసాను మనస్సు ఒకప్రక్క రాడని ఘోషపెడుతున్నా, పోనీ ఏ కారణంవల్ల నయితేనేం నిన్న రాలేకపోయాడనుకో. ఇవ్వాళ్ళేం మాయరోగం వాడికి. ఈ రోజయినా ఇంతవరకు రానేలేదు. ఇంక వస్తాడన్న ఆశాలేదు. ఏడేళ్ళగా వీడితో ఈ అవస్థ పడుతూనే వున్నా, ఏమిటో వాడిని మార్చాలంటే మాత్రం మనస్సువప్పదు." అయితే సుధ చెప్పింది నిజమే నన్నమాట

"విమలా నువ్వనేది మీసాంబయ్య విషయమేకదూ?" విమల నిజంగా ఆశ్చర్యపోయింది. నోరు తెరచుకొని నావైపే

చూస్తూ "నీకెలా తెలుసు వాడిపేరు" అంటూ నన్నడిగింది.

"నిన్నరాత్రి సుధ చెప్పింది బహుశా నిన్న ఫోను చేస్తూ నువ్వే చెప్పి వుంటావు చాకలివాడు రాలేదని, అందుకనే ప్రయాణాన్ని ఆపుకుంటున్నానని."

"సుధకు నేనలాంటి విషయాలేమీ చెప్పలేదే. దానికెలా తెలుసో ఈ విషయం"

"అయితే అర్ధమయిందిలే. ఇంతకు ముందెప్పుడో ఇలానే జరిగివుంటుంది. అందుకనే అనుకోని విధంగా నీ ప్రయాణం ఆగిపోగానే దాని క్కారణం సాంబయ్యే ననుకుని నాకు చెప్పింది. మరి నిజంకూడా అంతేగా." ప్రక్కనున్న ఇందిర అంతవరకేమీ మాట్లాడలేదు. నేను మాట్లాడటం ఆపగానే తను అందుకుంది. "నువ్వన్నదికూడా నిజమే. కాని ఎటొచ్చీ దూరపు ప్రయాణాలేవి ఆగలేదుకాని ఎన్నోసార్లు కాలేజి మాత్రం మానవలసి వచ్చింది సాంబయ్యవల్ల."

"రవీ నువ్వు సాంబయ్యగురించి పూర్తిగా విన్నా వంటే నవ్వు ఆపుకోలేవు తెలుసా?" విమ॥ పూర్తిగ అంది.

"అది సరేగాని అంతగా ఇబ్బంది పెట్టేవాడికి ఇంకెవ్వరూ దొరకనట్లుగా వాడికే మళ్ళీ మళ్ళీ గుడ్డలెయ్యటం ఎందుకు. ఒకవేళ మీ సాంబయ్య అందరికంటే బాగ్గా వుతుకుతాడా ఏం ఖర్మ." అడగగానే ఇందిర వెంటనే సమాధానం ఇచ్చింది.

"ఆ పెద్ద చవకేముందిలే. వంద బట్టలకి పదిరూపాయలు తీసుకుంటాడు. ఒక విశేషమేమిటంటే ఏడుసంవత్సరాల క్రితం మేం మొట్టమొదటిసారిగా ఎంత ఇచ్చామో ఇప్పుడూ అంతే ఇస్తున్నాం. తేడా ఏంలేదు."

"అయితే ఏడుసంవత్సరాల క్రితంకూడా ఇలానే తెస్తూండేవాడా బట్టలు. అన్నట్లు ఈకాలంలో వందకి పదంటే ఏమూల. అందుకనేనేమో అంతఆలస్యంగా తెస్తున్నాడు. ఇంకాస్త ధరపెంచితే తొందరగా తెస్తాడేమో చూడకపోయారా?"

"వాడిబొంద, ఎంత పెంచినా అంతేవాడు. అయినా ప్రతిసారి బట్టలు తెచ్చినపుడల్లా సినిమాకి డబ్బులివ్వందే కదలడు. పైగా వాడు వచ్చినపుడల్లా రై మోతయినాసరే; తిండిపెట్టే సమయంవరకు ఎలానూ వుంటాడు. కాబట్టి వాడికి భోజనం పెట్టించి పంపాలి. వాడొచ్చేటప్పుడు ఎంత తెచ్చుకుంటాడో ఆ దేవుడికే తెలియాలి. వచ్చినపుడల్లా పేరేచర్ల పోటానికి డబ్బులు లేవని అడగటం, ఆ రైలు ఛార్జీలేవో మేమివ్వటంకూడా పరిపాటి. ఇవన్నీకలుపుకుంటే ఎంతవుతుందో నువ్వే ఆలోచించు." లోపలినుంచి కాఫీ తెచ్చిఇస్తూ ఇందిర నాతో అంది.

ఇందిర మాట్లాడటం ఆపగానే విమల అందుకుంది. "ఒకోసారి సాంబయ్య గురించి ఆలోచిస్తూవుంటే ఎంతకోపం

వస్తుందో తెలుసా? ఊరికి వెళ్తున్నానని మరీ మరీ చెప్పి వున్న చీరలన్నీ వేసాను... వీడు సమయానికి అందిస్తాడా అని నాకు లోపల ఒకప్రక్క అనుమానంగానే వున్నా అనుకున్నట్లుగానే అంతపనీ చేసే తీరాడు. ఒకసారేమయిందో తెలుసా? ఇలానే తీసుకువెళ్ళిన ఒకనెల రోజులవరకు మా బట్టలు తిరిగి తీసుకునిరాలేదు. మాకా రోజుకో చీర కట్టాలాయెను. ఉన్న చీరలన్నీ కట్టేశాం. ఇందిర చీరలు నేను' నావి ఇందిర మార్చిమార్చి కట్టుకున్నా వున్న చీరలన్నీ అంటే కాలేజికి కట్టుకోదగ్గ చీరలన్నీ అయిపోయాయి. చూస్తుంటే సాంబయ్య వచ్చే సూచనలా లేవు. పెట్టె అడుగున పడివున్న పాతచీరలు పైకితీసి కట్టాలంటే సిగ్గేస్తుంది. అందుకనే ఆరోజున కట్టిన చీరనే మూడోసారనుకుంటాను కట్టుకుని కాలేజికి వెళ్లాను. మా క్లాసు అబ్బాయిలపని నీకు తెలుసుగా. ఏ అమ్మాయి ఏరంగు కట్టిందా అనేకదా వాళ్ళ దృష్టంతా. బొట్టుదగ్గరనుంచి కట్టువరకు అన్నిటిని మర్చిపోకుండా పరిశీలించే వేణు, నేను క్లాసులో అడుగు పెట్టగానే వెనకనుంచి ఏమన్నాడో తెలుసా. ''రమ్యమైన రెండవ వారమని.'' ఒకప్రక్క వాడి రెండుచెంపలు వాయిద్దామని అనిపించినా మరోప్రక్క ఏడుపొచ్చేసింది. ఆ క్షణంలో సాంబయ్యమీదెంత కోపం వచ్చిందో తెలుసా?''

"మరంలాటప్పుడయినా మాన్పించలేక పోయావా? పీడవదిలి వుండేది. ''నేను అడిగ్గానే ఇందిర దగరినుంచి సమా

భాసం వచ్చింది. "ఆ! విమలకోపం ఎంతసేపుంటుంది. సాంబయ్య వచ్చి ఎదురుగా నిలబడినప్పు డేమీ అనలేదు. ఎంతసేపటికీ ఇక్కడ కబుర్లు చెప్పవలసిందే."

'నువ్వు మరీ అలా అంటావే ఇందిరా, అయినా ఇం కొకడైనా సాంబయ్యలా కొన్నిరోజులకయినా మారక పోతాడా? అందుకనే క్రొత్తవాడితో బాధపడలేక పాతవాడే నయమని పిస్తూ వుంటుంది నాకు." విమల ఇందిరతో ఏకీభ వించనంది.

ఇందిర చేతికున్న వాచీ చూచుకుంటూ అంది "సరిగ్గా ఈవేళకి పేరేచర్లనుంచి గుంటూరు ప్యాసింజరు వస్తుంది. ఈ సమయానికి సాంబయ్యవల్ల బాధపడే హాస్టల్ వాళ్ళంతా బయటికొచ్చి సాంబయ్య వస్తాడేమోనని ఎదురు చూస్తుం టారు. ఒక అరగంట చూసిచూసి ఓపిక చచ్చిపోయినతర్వాత సాంబయ్య రాకపోవటంవల్ల కసిగా వాడిని శాపనార్థాలు పెడుతూ లోపలికి వెళ్ళిపోతారు." నవ్వు వచ్చింది నాకు. పాపం, భర్తరాకకోసం ఎదురు చూసే భార్యల అవస్థలా వుంది వీళ్ళ వ్యవహారం. ఆహా! సాంబయ్యా నీ బ్రతుకు గదా ధన్యమయిందని మనస్సులోనే అనుకున్నాను.

విమల ఏదో ఆలోచిస్తున్నదల్లా వున్నట్టుండి తనలో తనే నవ్వుకుంది. గమనిస్తూనే వున్నాను. ఎందుకు విమల

నవ్వేది నాకర్థంకాలేదు, అడుగలేదుకూడా కాని తనే కల్పించుకుని చెప్పటం మొదలు పెట్టింది. "ఒకరోజు ఇలానే సినిమాకి వెళ్లాలంటే మంచిచీరలు లేక మానేయాల్సి వచ్చింది. ఆ రోజే ఆసినిమా ఆకరి ఆటకూడా. జనంరద్దీ తగ్గినప్పుడు చూడవచ్చుకదా అని చివరి వరకు వాయిదావేసి చివరిరోజుకూడా వెళ్ళలేక పోయినందుకు నాకు నిజంగా ఏడుపొచ్చిందికూడాను. రూంలో వుండబుద్ధికాలేదు. ఇందిర స్నానానికెళ్ళిందను కుంటాను. ఇంతలో నాకో ఐడియా వచ్చింది. "ఏం సాంబయ్యా నీకసలు బుద్ధివుందా? నువ్వుతినేది అన్నమా లేక గడ్డా. నువ్వుబట్టలు తీసుకెళ్ళి నెలరోజులుపైగా అయిందే. మేమంతాను ఏం కట్టుకోవాలనుకుంటున్నావు. మాకేం గత్యంతరం లేకపోతే వేసామని నీవుద్దేశమా. ఇంకమీదట ఇలానే చేస్తుంటే నీకీ హాస్టల్లో ఎవ్వరూ బట్టలు వేయరు? వాళ్ళు అంతవరకు రాకముందు .... చేతకాకపోతే నువ్వే మానేయటం మంచిది." గొంతు చించుకుని పెద్దగా తిట్టటం ప్రారంభించాను. ఇంకేమయిందో తెలుసా! ప్రతిరూంనుంచి తలుపులు త్రోసుకుని బయటికి 'సాంబయ్యా వచ్చాడం'టూ బిలబిలమని బయటికివచ్చి చూస్తున్నారేకాని వాళ్ళ కంటికి సాంబయ్యా కన్పించనేలేదు. అసలు సాంబయ్యా వస్తేకదా వాళ్ళకి కన్పించటానికి.

"విమలా సాంబయ్యావస్తే చీవాట్లు పెట్టటంకూడా విన్నామే. ఇంతలోనే వాడు మళ్ళీ ఎటువైపు వెళ్ళినట్లు."

నావైపే చూస్తుంటే నాకా నవ్వాగటంలేదు. నవ్వేనన్ను చూచి "ఫో విమలా, నువ్వెప్పుడూ ఇంతే" ననుకుంటూ వెళ్ళిపోయారు.

ఇలా మాటలు సాగుతూనేవున్నాయి. ఒక్కనిమిషం అందరిమధ్య నిశ్శబ్దం ఆవరించింది. ఆనిమిషంలోనే ఇందిర వున్నట్లుండి కుర్చీలోంచి గెంతింది. ఇందిర ఎవరిని చూసి అంత సంతోషంతో గట్టిగా కేకవేసిందో నాకర్థంకాలేదు. ఇందిర ముఖంలో మాత్రం ఎనలేని సంతోషం స్పష్టంగా కన్పిస్తూవుంది. ఓ క్షణం ఆగి ఆపుకోలేని సంతోషంతో ఇందిరే మళ్ళీ అంది. "విమలా సాంబయ్య వస్తున్నాడు.... సాంబయ్య వస్తున్నాడు." అప్పుడే విమలచెప్పిన జోకును ఇందిర మళ్ళీ ప్రయోగిస్తుందేమో ననుకున్నాను.

కాని పెద్దమూటను తలపై పెట్టుకుని మోయలేక నడుస్తూ వస్తున్న ఓ ఆసామిని నాకళ్ళు పరిశీలించడం మొదలు పెట్టగానే ఇందిర నిజమే చెప్తున్నట్లు రూఢి చేసుకున్నాను. సాయంకాలపు మసక చీకట్లో సాంబయ్య ఎలావుంటాడో సరిగ్గా కన్పించటంలేదు. ఓ ఏనుగు గున్న నడిచివస్తున్నట్లనిపించింది సాంబయ్యనడక చూడగానే. సాంబయ్యను దగ్గరగా చూడాలని మనస్సెంతో ఆరాటపడి పోతూవుంది. కాని విమలను చూద్దునుగదా, ఆ వచ్చేదెవరో తనకేమి పట్టనట్లు అలా నిర్లిప్తంగానే కూర్చునివుంది. సాంబయ్యను చూడగానే ఇందిర

ఎగిరి గంతేయగాలేంది విమలకేం వచ్చింది. ఊడబట్టలేక పైకి అడిగేశాను.

"ఏం విమలా సాంబయ్య ...... అంములోనూ ఎన్నో రోజులగా ఎదురుచూసే సాంబయ్య ఎలానూ రానేవచ్చాడు. అయినా నీలో వుషారే లేదేమిటి. పోనీ ఈ పూటయినా ప్రయాణమయి మద్రాసు వెళ్ళవచ్చుగదా?" విమల నేనడిగిన దానికి నీరసంగా జవాబిచ్చింది.

"వీడు మా సాంబయ్య కాదు, ఇందిరావాళ్ళ సాంబయ్య. కాని గుణాలలోను, ఆలస్యంచెయ్యటంలోను మా సాంబయ్యకేమి తీసిపోడు" విమల తెలుగులోనే చెప్పినా నాకర్థంకాలేదు. "అయితే మీ సాంబయ్య ఇందిరావాళ్ళ సాంబయ్య ఒకడు కాదన్నమాట. కాని పేర్లు ఒకటిగానే వున్నాయే. మనిషిని పోలిన మనిషి మరొకడుండగా, ఒకే పేరుతో ఇద్దరు మనుష్యులుండటం ఆశ్చర్యం లేకపోయినా నాకు తమాషాగానే వుంది." అన్నాను నేను. ఇందిర బట్టలు లెక్కచూసుకోటానికి లోపలికి వెళ్ళబోతూ "మాఇద్దరు సాంబయ్యలూ ఒకటి కాకపోయినా విమలా వాళ్ళసాంబయ్య మా సాంబయ్య తమ్ముడే. అసలు ఈ హాస్టల్లో ప్రతికే చాకలి వాళ్ళందరికీ ఏదోఒక బంధుత్వం వుండనే వుంటుంది. పేర్లు వేరయినా ఎవరినయినాసరే సాంబయ్యనే పిలవటం అందరి. అలవాటు ..." చెప్తూనే ఇందిర లోపలికి వెళ్ళిపోయిందికీ మళ్ళీ త్వరగానే వచ్చేస్తానంటూ.

వెళ్తున్న ఇందిరను అదేపనిగా చూస్తుండే నన్నుద్దేశించి విమల "ఈ ఏడేళ్ళలో బట్టలుతికే వాళ్ళనేకమంది మా హాస్టల్‌కి వచ్చినా, వాళ్ళను కుదుర్చుకునేముందు నీ పేరేమిటని కూడా ఎవ్వరూ అడగరు. ఒకడు కుదరగానే వాడు వాళ్ళ దృష్టిలో సాంబయ్యవుతాడు. ఒకవేళ ఆడచాకలనుకో దాన్నేమో 'సాంబి' అంటారు. నవ్వొస్తుందికదూ నీకు!" తను కూడా నవ్వుతూనే అడిగింది.

ఆరోజుమొదలు నేను హాస్టలికి వెళ్ళగానే విమలను గాని, ఇందిరనుగాని సాంబయ్య బట్టలు తెచ్చాడా లేదా అని అడగటం అలవాటయింది. అప్పటికిగూడ రాలేదని చెప్పిన తర్వాతగాని ఇంకేదయినా విషయాలు మాట్లాడుకోవటం ప్రారంభించేవాళ్ళంకాదు. అలా ఒక వారంరోజులు గడిచిపోయాయి. పాపం వూరుకెళ్ళటం సంగతి ఎలావున్నా మళ్ళీ కాలేజి తెరిచే రోజులు దగ్గరకొస్తున్నాయి విమలకు. విమలకు సాంబయ్యమీద ప్రతిరోజూ కోపం వస్తుందోలేదోగాని, నాకుమాత్రం సాంబయ్యకనిపిస్తే తినేద్దామన్నంత కోపం వస్తోంది. కాని ఒకోసారి మాత్రం సాంబయ్యను తలచుకుంటే దానంతటదే నవ్వు వచ్చేది. కోపంవచ్చినపుడు మాత్రం విమలను "వాడిని మాన్పించటంకూడా చేతకానిదానివి. ఎలా బ్రతుకుతావోఏమో. అయినా నాకెందుకులే. ఇబ్బంది పడేది నువ్వేగా. నాకేంలే." అని పైకి అంటూవున్నా లోపల విమలంటే చాలా జాలివేసేది.

"రవీ! సాంబయ్య ఇంతకుముందెప్పుడూ ఇంత ఆలస్యం చెయ్యలేదే. ఈసారసలు వాడు బ్రతికున్నాడో లేదో కూడ అనుమానంగానేవుంది. అయినా ఇందిరావాళ్ళ సాంబయ్య వచ్చినప్పుడు అడిగితే మాసాంబయ్య మరుసటిరోజే వస్తాడని చెప్పేడుకదా? చెప్పి పదిహేను రోజులయినా ఇంతవరకు రాలేదంటే ఏమనుకోవాలో నువ్వే చెప్పు. ఇంతకీ తీసుకెళ్ళిన బట్టలు కాలిపోవటం జరగలేదుకదా? ఈమధ్య పేరేచర్లలో ఇళ్లు కాలిపోయాయట కూడా. ఒకవేళ బట్టలున్నా, సాంబయ్య వూర్లో వున్నాడో లేదో. రవీ ఎందుకయినా మంచిది నువ్వోకసారి పేరేచర్ల వెళ్ళిరాకూడదూ?" విమల నన్ను కోరినందుకు వెళ్లాలనిపించకపోయినా, ఎందుకో రోజులు గడుస్తున్నకొద్ది సాంబయ్యను చూడాలన్న వుత్సాహం నాలో ఎక్కువయింది. అందువల్లనయినాసరే పేరేచర్ల వెళ్ళి సాంబయ్యను చూడటంతోపాటు వాడిసంగతేదో తేల్చుకొద్దామని విమలను వివరాలన్నీ అడిగి వాడిసరియైన అడ్రసు తీసుకుని ఒకరోజు వుదయానే బయలుదేరా ఎలాగయితేనేం.

గుంటూరుకి పేరేచర్ల ఆట్టే దూరం లేకపోయినా, రైలు ఆగిఆగి నడవటంవల్ల ఆకొద్దిదూరానికే ప్రయాణం విసుగెత్తింది. రైలు దిగిన తర్వాత కాలినడకనే వూళ్లోకి బయలుదేరాను. స్టేషనుకు సాంబయ్యిల్లు కనీసం ఓ మైలు దూరమయినా వుంటుంది. సాంబయ్య ఇంటి మధ్య

దారిలో కన్పించిన ఓ మనిషిని చూసేటప్పటికిగాని సాంబయ్య ఎందుకు ఆలస్యం చేసేది నాకర్థం కాలేదు.

ఆమనిషి నీటుగా మడత నలగకుండా కట్టిన చీరని అలాచూస్తూ నిలబడిపోయాను ... ఆరోజు నాకింకా బాగా జ్ఞాపకం. నాతోపాటు బజారుకు రమ్మన్నప్పుడు టెరిలిన్ చీరకట్టుకుని విమల వచ్చింది. సిగరెట్ జోరుగా పీల్చుతూ వుంటే నన్నుద్దేశించి "రవీ, జాగ్రత్తసుమా. ఈగాలికి నిప్పు రవ్వ పడిందంటే చీరకాలిపోయి ఎందుకూ పనికిరాకుండా పోతుంది. అందులోను ఇదిక్రొత్తచీర కూడాను." విమల హెచ్చరించినట్లే సిగరెట్లోనుంచి ఓ నిప్పుకణం ఎగిరి విమల చీరకు ఒకపెద్ద రంధం చేయటంవరకు జరిగిపోయాయి. ఆ చిరుగును 'డార్నింగ'యినా చేయించలేదు విమల. ఆరోజు విమల కట్టిన చీరనే ఈరోజున ఠీవిగా కట్టుకుని నడిచే ఈవిడ తప్పకుండా సాంబయ్య పెళ్లాం అయింటుందనుకున్నాను. ఎందుకంటే చాకలయి పుట్టిన ఎవడూ తనబట్టలంటూ అనటానికి వీలుగానయినా ఓ జత కొనుక్కోడు. వాడికి నచ్చాలేగాని, మనబట్టలు మనకన్నా వాడిఒంటిమీదే ఎక్కువరోజు లుండటం కూడా కద్దు.

"ఏమమ్మా .... సాంబయ్య ఇల్లెక్కడో చెప్తారా?" పలకరించగానే, నేనేదో కావాలనే తనని పలకరించాలని ఆమెతో మాట్లాడినట్లు నావైపు విచిత్రంగానూ అనుమానస్పదంగానూ చూసింది. "సాంబయ్యెవరు?" అని మళ్ళీనన్నే

ప్రశ్నించిందికూడాను. కాని నాజవాబు వచ్చేలోపల 'ఏమో సాంబయ్యోవరో నాకు తెలియదంటూ వెళ్ళిపోయింది తిరిగి వెనక్కయినా చూడకుండా.

సాంబయ్య ఎవరో తెలియని ఆవికకు విమల చీరెలా వచ్చింది కట్టుకోటానికి. సాంబయ్య ఇంట్లో దొంగలించిందా? ఛా! ఛా? అంతగా దొంగిలించినట్లయితే ఈవూర్లోనే ఇంత పబ్లిగ్గా తిరగగల్గుతుందా? ఏమో. నాకేమి అర్థం కావటం లేదు. అయినా ఏదయితే ఏమిలే. ఆవిషయాన్ని గురించి ఎక్కువగా ఆలోచించదలచ లేదు నేను.

చివరి కెలాగయితేనేం సాంబయ్య ఇల్లు కనుక్కున్నాను. ఇంటిబయటనుంచి గట్టిగా 'సాంబయ్యా' అని కేక వేసిన పదినిమిషాల తర్వాతగాని సాంబయ్య బయటికిరాలేదు. వచ్చిన మరుక్షణమే అనుకున్నాను. "పొరపాటున పిలిచేననుకునేమో ఇందిరావాళ్ళ సాంబయ్యవచ్చాడు. విమలావాళ్ళ సాంబయ్యకూడా ఇక్కడే వుంటున్నాడేమో. సరే వీడినడిగితే అన్నివిషయాలు తెలిసిపోతాయికదూ?" అనుకుంటూనే సాంబయ్యా విమలమ్మగారికి బట్టలుతికే మీ తమ్ముడు సాంబయ్య ఇల్లెక్కడ. ఈఇల్లుకాదా?" అడిగాను వాడిని.

ముసిముసి నవ్వులు నవ్వుతూ ఇందిరావాళ్ళసాంబయ్య "మీరుకూడా హాస్టల్లోని ఆడపిల్లల్లాగనే అంటున్నారేమిటి బాబూ! విమలమ్మగారి బట్టలుతికేది సాంబయ్యకాదు బాబూ,

వాడిపేరు రంగడండి. రంగడు నాతమ్ముడేనండి." అనగానే నాకేమనాలో తోచలేదు.

చచ్చాంరో. ఇంతకీనేను చూడాలనుకున్నది సాంబయ్యో కాదన్నమాట. సాంబయ్యనే రంగయ్యను చూడాలన్నదే నాకోరికకదూ? పోనీలే ఏ అయ్యోతేనేం. సాంబయ్యలాంటి రంగయ్యను చూడాలినేను. .... తప్పదు ఇంతదూరం వచ్చినందుకు నా విమలపని పూర్తిచేసుకున్న తర్వాతనే వెనక్కుతిరిగి వెళ్ళటం. అసలు సాంబయ్యే ప్రక్కనేవుండే రంగయ్య ఇల్లు చూపించాడు.

రంగయ్య ఇంటికెళ్ళి అతనిని పిలవకముందే విమలదే మరో చీర దాంతోపాటొక అర్ధరూపాయికాసు చేతిలో పెడుతూ 'ఇదిగోనమ్మా నీచీర దానిఅద్దె అర్ధరూపాయి. నువ్వన్నట్లుగానే మీ ఆయన వూరినుంచి రాకుండానే తెచ్చి ఇస్తున్నా. ఇప్పుడే చూచుకోతల్లీ నీ నోరసలే మంచిదికాదు. తర్వాత చిరిగినా నేనే చింపి ఇచ్చానంటావు." ఓ ఆడపడుచు మరొాఆమెతో చెప్తూంది. ఇంతకుక్రితమే జరిగిన సంఘటనలోని గూడార్థం ఇప్పుడర్థమయింది నాకు. 'హాస్టలు వాళ్ళబట్టలు రంగయ్య తెచ్చి ఇంట్లోపెడితే వాడిపెళ్ళాం ఈ వ్యాపారం చేస్తూవుంటుందన్న మాట. అద్దెచీరలన్నీ వసూలుచేసుకుని వాటిని మళ్ళీవుతికి ఇస్త్రీ చేసి ఇచ్చేటప్పటికి వాడికన్ని రోజులు పడ్తూవుంది. రంగయ్య భార్యను నేనుబట్టలు అద్దె

కిచ్చే విషయంగురించేమి మాట్లాడలేదు. రంగయ్యను బయటికి పిలవమని అడిగినపుడు రంగయ్య వూర్లోలేడని అత్తారింటికి వెళ్లాడని చెప్పింది. "రంగయ్య రాంగానే వెంటనే విమలమ్మగారి బట్టలు తీసుకురమ్మనిచెప్పు" అని మాత్రం చెప్పేసి వచ్చిన దారినే ఇంటి ముఖంవైపు దారితీసాను.

★

ఎన్నోరోజులు గడచిపోయాయి. సాంబయ్యను చూడాలన్న కోరిక అలానే వుండిపోయింది. మావూరెవరయినా వస్తానని అంటే వాళ్ళనుకూడా రమ్మని మని అడిగే వాడిని, కనీసం వాళ్ళతోనయినా వెళ్ళినపుడు సాంబయ్య కన్పిస్తాడేమోనని. సెలవలకు మళ్ళీ ఇంటికిరాగానే కొన్నిరోజుల క్రితమే క్రొత్తగా డాక్టరయిన విమలను అడిగాను "ఏమండీ డాక్టరుగారు క్షేమంగా వున్నారా? అన్నట్లు మీసాంబయ్యలో ఏదైనా మార్పువచ్చిందా? ఇప్పుడేనా బట్టలు తొందరగా తెస్తున్నాడా. లేక పోతే మీ బట్టలతో వాడి వ్యాపారం సాగుతూనేవుందా?"

'నీకో శుభవార్త చెప్పనా? నువ్వెప్పుడయితే సాంబయ్య బట్టలు అద్దెకిస్తున్నాడని చెప్పావో అప్పటినుంచి వాడిని మాన్పించేయాలని ప్రయత్నించాను. చివరికెలాగయితే

నేం మాన్పించేసాను. ఆరోజు వాడుదిగులుగా ఇంటికిపోతుంటే నాకెంతో బాధవేసింది. .... పాపం సాంబయ్య"

"అయితే నిజంగా శుభవార్తే. అంతేకాదు సంతోషమైన వార్తకూడాను. క్రొత్తగా వచ్చిన వాడయినా సరిగ్గా తెస్తున్నాడా? యింతకీ వాడిపేరేమిటి?"

"సాంబయ్య!!"

నోరు తెరచుకుని అలానే వుండిపోయాను. ఇదే సందుగదాఅని ఓ ఈగ నోటిలో దూరింది.